# నిర్మల

★ గోలేటి శ్రీ జగన్మోహనరావుగారు

"ఛీ! సిగ్గులేదూ ... నాతో మాట్లాడొద్దని ఎన్నిసార్లు చెప్పాలి!" — ఈమాటలు జ్ఞాపక వచ్చినప్పుడల్లా అతని హృదయం పట పట కొట్టుకుంటుంది. అయిదు సంవత్సరాల క్రితం విన్నమాటలవి. నిర్మల అత న్నంత త్రుంచేసి మాట్లాడుతుందని ఎన్నడూ అనుకోలేదు. లేకపోతే ఆ అమ్మాయితో మాట్లాడక పోయేవాడే ... "అయినా ఎప్పటి సంగతో జ్ఞాపకం చేసుకోవడం ఎందుకు" — అనుకొని ఎంత మరచిపోదమన్నా మరపు రావటం లేదాయే ... ఆ అమ్మాయిమీద అంతమోజు ఎందుకుండేదో అతనికి అర్థం కాలేదు ... ఇప్పుడు కూడా అతనికి నిర్మలంటే ఎంతో గౌరవం. నిర్మలచేత ఎన్నోసార్లు అవమానింపబడ్డాడు ... ఎప్పుడూ అతణ్ణి నిరసించి మాట్లాడుతూండే దా అమ్మాయి ...అయినా నిర్మలంటే ఎందుకో అంతప్రీతి? ... నిర్మలలో ఏదో ఒక చెప్పలేని శక్తివుంది. ఆకళ్ళల్లో ఏదో దివ్యజ్యోతి మిల మిల మెరుస్తూంటుంది. పద్మం వంటి ఆముఖంలో ఎప్పుడూ ఒకకాంతి వెలుగుతూంటుంది ... అందుకేనేమో మనోహరం ఒకొక్కప్పుడు నిర్మలని చూస్తూ చాలా నిమిషాలదాకా అచేతన వస్తువులా నిలబడి పోయేవాడు !

♦ ♦ ♦

మనోహరం తండ్రి రాజమహేంద్రవరంలో ఎన్నుకోతగ్గ మనిషి. ఆ కుటుంబం దరిద్రనారాయణుల సాన్నిహిత్యాన్ని... దరిద్రాన్నైనా దర్జాగా అనుభవించాడు చాలారోజులు. నక్షత్రం తిరిగింది. అదృష్టం తన్నుకొచ్చింది. ఇప్పు డతన్ని ధనవంతుల జాబితాలో చేర్చారు. ఊరికి కొంచందూరంలో ఒకసామాన్యమైన బంగళా కట్టించాడు. ధనాన్నిబట్టి తెలివితేటలు కూడా రాణింపుకొచ్చాయి.

చిన్నప్పటినుంచీ మనోహరానికి మొక్కలు పెంచటం అంటే చాలాకుతూహలం. అంచేతే ప్రత్యేకశ్రద్ధ తీసుకుని బంగళాచుట్టూ ఎన్నో మొక్కలు పాతించీ, పందిళ్ళమీదకి లతల్ని పాకించీ రోజూ వాటికోసం ఎంతో కష్టపడుతూండేవాడు. తెల్లారగానే మేడమీది కిటికీలోంచి తనమనోహరమైన తోటని చూసుకుని మురిసిపోతూండేవాడు. మనోహరం అదోరకం మనిషి. అతని స్వభావం అర్థం చేసుకోవటం కష్టం. ఒకొక్కప్పుడు నిర్మలమైన ఆకాశాన్ని చూస్తూ గంటలతరబడి అలానుంచుని పోయేవాడు. "ఈమనోహర ప్రకృతికి నేను దాసుణ్ణి; ఈ సౌందర్యాన్ని చూస్తూ ఇలాతన్మయత్వంలో మునిగి ఆనందిస్తాను" అనేమాటలు అప్పు డప్పుడు జారుతుండేవి అతని పెదవుల మధ్యనుంచి. అందంగావున్న ఏవస్తువు కనిపించినా చూస్తూ పిచ్చివాడిలాగ అలానుంచుని పోయేవాడు. ఎంతోమంది అతని స్వాభావం మంచిదికాదనీ, మనోహరం చెడ్డవాడనీ అంటూండేవారు ... "నా హృదయం నిర్మలం. సౌందర్యం ఎక్కడవున్నా ఆస్వాదించి ఆనందిస్తాను. ఇందులో ఏమాత్రం తప్పులేదని నా దృఢనమ్మకం" అన్న అతడి భావాలు ప్రజల అభిప్రాయాల్ని గడ్డిపరకగా చూడసాగాయి. అలాగే కాలం సాగుతూండేది.

నిర్మల తండ్రి ఆవూళ్ళోనే గొప్ప ఉద్యోగస్థుడు. లక్షలాదిగా ధనం వుంది. ఒక్కత్తే కూతురవటంచేత నిర్మలని ఎంతో గారాబంగా చూసేవాడు. ఇంట్లో నిర్మల, వీధులో తన ఆఫీసుపని వీటితో తప్ప ఆయనకి మరోదాంతో ఎక్కువ సంబంధంఉండేది కాదు. నిర్మలతల్లీ మనోహరంతల్లీ తరుచు కలుసుకుంటూండేవాళ్ళు. వాళ్ళిద్దరికీ ప్రాణస్నేహంకూడాను. నిర్మలకి మనోహరంతల్లంటే ఎంతో గౌరవం ప్రేమానూ. ఇళ్ళురెండూ ఎదురెదురుగానే ఉండటంచేత నిర్మలకాలేజీనించిరాగానేవీళ్ళింటికి చక్కావచ్చేది. "లలితమ్మగారూ" అంటూ ఆపాటికి మనోహరం కూడా యింట్లోనే ఉండేవాడు. కాలేజీ లెక్చర్లతో విసిగెత్తి విసిగెత్తి యింటికి రాగానే పందిరికింద చల్లగాలిలో కూనిరాగాలుతీస్తూ కూర్చునేవాడు ఆకాశం కేసిచూస్తూ. కాని నిర్మల రావటం వెళ్ళిపోవటం రెండూ కూడా చాలా దీక్షగా పరికించేవాడు. అతన్ని అచలత్వంలోంచి చంచలింప చేయగల సౌందర్యరాశి నిర్మల మాత్రమే.

నిర్మల అతణ్ణి చూసినతక్షణం పిచ్చాడికింద కట్టేయటంచేత ఆ అమ్మాయికి అతనంటే ఏమాత్రమూ గౌరవం వుండేదికాదు. నిర్మల మొదట మనోహరాన్ని కలుసుకున్నది వాళ్ళహాల్లోనే అప్పుడు మనోహరం. చినిగినలాగూ తొడుక్కుని, చొక్కా లేకుండా అష్టకష్టాలూపడుతూ తనసైకిల్ని మరమ్మత్తు చేసుకుంటు న్నాడు. ఈహడావిడిలో నిర్మలవచ్చిన ఉనికే తెలియలేదతనికి. నిర్మలకాస్సేపు నుంచుని అతనివేషం వాల కంచూసి కిలకిలనవ్వి వెళ్ళిపోయింది. పాపం వెంటనే మనోహరం ఆ అమ్మాయిని చూసి "లోపలికి వెళ్ళవచ్చునండీ" అన్నాడు కూడాను. కాని "ఫరవాలేదులెండి. సైకిలు సంగతి చూడండి. నేను మళ్ళీ వస్తాను" అన్నమాటలు గబగబ రాలాయి. అతను నిర్ఘాంత పోయాడు.

తననిచూసి ఆ అమ్మాయి నవ్వడానికి కారణం ఏమిటి? నేనేమైనా విపరీతంగా కనిపిస్తున్నానా? అనుకుని వెంటనే అద్దందగ్గరనుంచుని చూసుకున్నాడు తన రూపురేఖలు; ముఖంనిండా నల్లటి మరకలు, చొక్కాలేని వళ్ళూ, చిరిగిపోయిన లాగూ తనకే ఛీ అనిపించింది. దవడమీద ఒకలెంపకాయి కొట్టు కున్నాడు. తనలో అందం అనేది లేదేమో... అందుకే ఆసుందరి అలానవ్వింది. తనయింటికి వచ్చినప్పుడు నిర్మలనిచూడ్డం అదే మొదటిసారి... కాదు కాదు; నిర్మలకి తననిచూడ్డం అదే. మొదటిసారి — అతను ఆ అమ్మాయిని చాలాసార్లు చూశాడు. తన ఆంతర్యంలో ఏదో ఒక అవ్యక్తమైన భావం చలిస్తూండటం మొదలుపెట్టింది కూడాను కొద్దిరోజుల్నుంచీ; ఆభావం అతనికి పూర్తిగా అర్థం అవకుండానే నిర్మల అతనికళ్ళకి గోచరిస్తూంటుంది. అది నిర్మలమీద అతనికిగల గౌరవం అన్నాసరే లేక స్నేహభావం అన్నాసరే. నిర్మల అన్నపేరు నిజంగా అతన్ని ఊపేస్తుంది. దానికి కారణం చెప్పడంమాత్రం కష్టం.

ఇంకా నాలుగైదు సార్లు కూడా నిర్మల వాళ్ళింటికి వచ్చినప్పుడు ఆంతకంటె అసహ్యమైన దుస్తులతో సామాను సర్దుతూనో, పిచ్చిపాట పాడుతూనో ఆ అమ్మాయి కంట పడ్డాడు. నిర్మల అతనికేసి చూసి వెంటనే తలదించుకుని నవ్వుకుంటూ లోపలికి వెళ్ళిపోయేది. అప్పుడు అతడిహృదయం దహించుకు పోయేది. రాత్రంతా నిద్రపట్టేదికాదు. తనొక సామాన్యజీవి. తనలో విశేషమైన గుణాలేవీ లేవు. "మనోహరం చాలాఅందమైనవాడు" అని తనబంధువులనోటివెంట అక్కడక్కడవిన్నా ఆ మాటల్లో అతనికేమాత్రం నమ్మకంలేదు. కనక తను అందగాడుకూడా కాదు. అందుకే నిర్మల తనకేసి చూడదు. అందుకే నిర్మలకి తనంటే అంతహేళన. ఈ ఆలోచనలతో అతనిబుద్ధి తిరిగిపోతూండేది. "అవును. నా అంతవాణ్ణినేను. నిర్మలంతటిది ఆ అమ్మాయి. నాగౌరవంనాకుంది. ఆ అమ్మాయిగౌరవం ఆ అమ్మాయికుంది. నన్నుచూసి ఎందుకు నవ్వుకోవటం?" ఆ అమ్మాయి తన్నిచూసినప్పుడల్లా ఎందుకు అల్లా లోపల లోపల నవ్వుకుంటుంది? ఈసారి యీమాటతప్పకుండా అడిగెయ్యాలనిపించేదతనికి. నిర్మలంటే చాలాకోపంకూడావచ్చేది. మళ్ళీ ఎక్కడలేనిగౌరవం అతనికి నిర్మలంటే. మనస్సుని ఎంతతడివినా కారణం కనుపించదు. ఇదిచాలా ఆశ్చర్యంఅని తనే అనుకుంటూండేవాడు.

తరవాత తరవాత నిర్మల వాళ్ళింటికి తరుచు రావటంమూలాన్ని కాస్సేపుమాట్లాడి ఆకోకిలస్వరాన్ని విని ఆనందించాలని కుతూహలంగా ఉండేదతనికి. అయిదారుసార్లు ఆ అమ్మాయే మాట్లాడవలిసొచ్చి మాట్లాడిందతనితో. అందులోనూ కరకుతనం నిరసనభావం లేకపోలేదు. అయినా నిర్మలతో మృదువుగానూ, మధురంగానూ మాట్లాడదామనే ప్రయత్నించాడతను. కర్మంచాలక మాట్లాడినా నిర్మల తలవంచుకునే మాట్లాడేదిగాని తలెత్తి అతన్నిచూడనైనా చూసేదిగాదు. అదీ మంచిదే అనుకునేవాడతను ఆమె దివ్యసుందరవిగ్రహాన్ని క్రిందినుంచి పైవరకూ తనకళ్ళతో కొలుస్తూ. ఇలా కొన్నాళ్ళుగడిచినై. మరి కొన్నిసార్లు ఆ అమ్మాయిని తనే మాట్లాడించడానికి ప్రయత్నించాడు. ఒకటి రెండుప్రశ్నలకి కరుకైన సమాధానంతప్ప మరేం మాట్లాడేదికాదు నిర్మల. చాలాసార్లు తనతో మాట్లాడొద్దనీ తనకి కోపంవస్తుందనీ కూడా సూచించింది. ఇలాంటి మాటలన్నీ మనోహరం మనస్సులో బాగామధింపబడి చివరికి మాయ మైపోతుండేవి. మళ్ళ యథాప్రకారమే. మర్నాటినుంచీ ఇలా కొంతకాలంసాగింది.

ఆవాళ దీపావళిపండగ. అన్నియిళ్ళూ దీపాలవరసల్తో కలకలలాడుతున్నాయి. పండక్కి మనోహరం చిన్నతమ్ముడు వాళ్ళమామగారి ఊరెళ్ళాడు. తల్లి నిర్మలగారియింటికి వెళ్ళింది అయిదునిమిషాల క్రితం... ఇంట్లో లైటువేసుకుని పత్రికచదువుతున్నాడు మనోహరం. తండ్రి యింకా యింటికిరాలేదు. గుమ్మందగ్గిర ఏదో తళుక్కునిమెరిసింది. మనోహరం ఒళ్ళు గగుర్పొడిచింది. విద్యుల్లతలాగ మెరిసిపోతోంది నిర్మల. ఆ ఆకాశరంగు చీరలోంచి మిలమిల మెరుస్తోంది నిర్మల స్వర్ణదేహం కొన్నిచోట్ల .. నిర్మల నిజంగా ఒకదేవతా స్త్రీ... వర్ణించడానికి మాటలుంచాలవు... "అమ్మ యింట్లోలేదు..." అన్నాడు మనోహరంమెల్లిగా... కాని దృష్టంతా నిర్మలమూర్తిమీదే లయమైవుంది. నిర్మల యీమాటవినిపించుకోకుండానే యింట్లోకివెళ్ళింది... మళ్ళీ నిర్మల ఎప్పుడువస్తుందా మాట్లాడుదామా— అని మనోహరం ఊపిరి బిగబట్టి ఏకదృష్టితో నిర్మల రాకకోసం ఎదురు చూస్తున్నాడు. హృదయం యిప్పుడతని వశంలో లేదు. టపటప కొట్టుకుంటూన్న శబ్దం ఏదో తనలోంచి వినిపిస్తోందతనికి. లలిత యింట్లో ఎక్కడా లేకపోవడం మూలాన్ని మళ్ళీ శరవేగంతో హాల్లోకివచ్చింది నిర్మల.

"నేను చెప్పానుకదూ అమ్మలేదని...వెళితే మీయింటికే వెళ్ళుండొచ్చు ... దీపావళి హడావిడేవి టిదంతా ?" ఇన్నిమాట లెలా అనగలిగాడో అతనికే అర్ధం అవలేదు. ఆతురతతో సమాధానంకోసం ఎదురు చూశాడు.

"ఛీ—సిగ్గులేదూ...ఎన్నిసార్లుచెప్పాలి నాతో మాట్లాడొద్దని!" పిడుగుల్లా రాలాయి యీ అక్షరాలతనిమీద...నిర్మల మెరుపులా మాయమైంది. నిర్మలని వెంటనే ఖూనీచెయ్యాలనిపించిందతనికి. తక్షణమే కుర్చీమీంచిలేచాడు ... ఛా! వెధవహృదయం — ఒకఆడది వివక్షతలేకుండా అన్నమాటలకి తనలో అంతచలనమా ... మనస్సులో ఒక తుఫానురేగినంత హడావిడా... వెంటనే మళ్ళీకుర్చీలో కూలబడ్డాడు. బుఱ్ఱ గిఱ్ఱుమని తిరిగిపోతూంది... తనేమైనా తప్పుమాటఅన్నాడా? అసలు మాట్లాడడమే తప్పకదూ? ఏవిటో? అంతా అయోమయంగా వుందతనికి ... తనుమాట్లాడినంతమాత్రాన సిగ్గుమాలినవాడయ్యాడా? ఈ మాట సహించడం ఎలా? నిర్మలలో మానుషత్వంలేదు — నిర్మల పశువుకాదు... నిర్మల దేవత—తనేపశువు. లేకపోతే నిర్మలచేత ఎందుకు తిరస్కరింపబడాలి ?... ఏవిటో అంతా గోలగా వుందతనికి. సౌందర్యమే అతనికి ముఖ్యమైనవస్తువు. తను అందంగాలేడు కనక నిర్మల అలాకరుకుగా మాట్లాడగలిగిందనేభయం, అతన్ని కలతపెట్టేస్తుంది...అవును తను అందంగాలేకపోతే నిర్మలంతటిసుందరి తనని ప్రేమించడంఎలా? ప్రేమించాలి! అదేంమాట? .... ఏదో కొత్తభావం ఉద్భవించినట్టయిందతని మనస్సులో నిర్మల తనని ప్రేమించాలని యిదివరకెన్నడూ తనుకోరినట్టులేదే ... ఎప్పుడూ అనుకున్నట్టుకూడా లేదే? ఆ విషయం! మళ్ళీ అంతాచిక్కుగా కనిపించిందతనికి ... ఒక ఆలోచనకాదు. ఒకభావంకాదు. హృదయంఅంతా అదిరిపోతోంది.

ఇంతహడావిడైనా చివరకి నిర్మలంటే గౌరవంమిగిలిందతని మనస్సులో. అతనికే చాలా ఆశ్చర్యం వేసింది. ఫక్కునినవ్వాడు ఒకసారి. అదే ఆఖరిసారి అతనికి నిర్మలనిచూడ్డం. నిర్మలరూపం యింతకుముందే గాఢంగా హత్తుకుందతని హృదయంలో... ఇప్పుడు మరీ స్ఫుటంగా నాటుకుంది ఆమూర్తి ...మనోహరం చదువుమీద కలకత్తావెళ్ళవలిసొచ్చింది, తనమామగారింటికి···మరినాలుగుసంవత్సరాలకి కలకత్తావదిలి బెంగుళూరువచ్చాడు చదువుమీదే.

పాపం కలకత్తాలో ఒకకారు కిందపడి తలమీద ఒకగాయంతిన్నాడు. ఆదితర్వాత బాగా నిమ్మళించినా ఒకనాటుమాత్రం చిహ్నంగా వుండిపోయింది... మనోహరం యిప్పుడు పూర్తిగా మారిపోయాడు. ఆగాయంతో మనిషిలో మరీ మార్పొచ్చేసింది. నవనవలాడేముఖం చిన్నప్పుడే అందమైందేమో యిప్పుడు మరీ శోభావంతంగావుంది. నుదుటిమీదవున్న ఆ నాటుకూడా అతనిసౌందర్యానికి దోహదం అనేచెప్పాలి. ఆ అంగసౌష్ఠవం! ఆ విశాలవక్షస్థలం! అతను నిజంగా సౌందర్యమూర్తి. నడకలో ఒకఠీవి, చూపులో ఒక ఆకర్షణశక్తి, మాటలో మాధుర్యం తొణికిసలాడుతున్నా యిప్పుడు. (సశేషము)

# నిర్మల ★ ★ ★ గోలేటి శ్రీ జగన్మోహనరావుగారు

(గతసంచిక తరువాయి)

"కబ్బన్ పార్కు" లో అతను పాలరాతిమీదకూర్చుని నిశ్చలమైన ప్రకృతిరహస్యాన్ని తెలుసుకోడానికి ప్రయత్నిస్తూన్నట్టుగా నిర్మలంగా చూస్తున్నాడు. మనోహరమైన చెట్లనీ, ఆచెట్లమధ్యనుంచి తొంగిచూసే చందమామనీ......ఆకాశం ఎంతో రమ్యంగావుంది వివిధవర్ణాలతో......కొంతసేపటికి దృష్టి క్రిందకిదించాడు......ఒక్కసారి ప్రశాంతంగా కళ్ళుమూసుకున్నాడు ... అమాంతంగా ఒళ్ళు జలదరించింది. నిర్మల అన్నమాటలు మళ్ళీ జ్ఞప్తికివచ్చాయి. ఆలోచన్లు శరవేగంతో పరిగెడుతున్నాయి బుఱ్ఱచుట్టూ...తలక్రిందికిదించి ఆలోచిస్తున్నాడేదో గాఢంగా ... ఉన్నట్టుండి గడియారంమీదకెళ్ళాయి దృష్టులు. "అబ్బా! ఎనిమిదయింది!" అని మెల్లిగా అనుకుని ప్రయాణమయ్యాడు "రూం" వేపుకి ఇరవైనిమిషాల్లో ఒక ఉన్నతభవనందగ్గిరకొచ్చి ఆగాడు ... లోపలికెళ్ళి తనగదితలుపు తీసుకుని మంచంమీద వాలాడు కళ్ళుమూసుకుంటూ. ఆ గదికని అతను ఎన్నికష్టాలుపడ్డాడో బ్రహ్మకేతెలియాలి. ఆభవనం ఒక గొప్పపెద్దమనిషిదనీ, అతను బొంబాయి కాపరస్తుడనీ, వేసంగిలోమాత్రం బెంగుళూరువచ్చివుండడానికని ఆమేడకట్టించాడనీ తెలుసుకుని అక్కడి కాపలాగుమాస్తాకి చెయ్యరానిసేవచేసి ఆపెద్దమనిషికి వ్రాయింపించి, ఆగది అద్దెకివ్వడానికి అనుమతితెప్పించుకోవడాని కతని తాతలుదిగొచ్చారు ... ఎలాగైతేనేం "రూం" సాధించాం అని చాలాగర్వపడ్డాడు మనోహరం. అప్పుడే. వేసవికాలంవచ్చింది... సాయంత్రం ప్రతిరోజూ పార్కుకిపోయి కూర్చుని వస్తూండటం అలవాటుచేసుకున్నాడతను—అవాళ రాత్రి అక్కడిగుమస్తా, బంట్రోతులూ చాలాహడావిడిగా వున్నారు. ఇక్కడి సామాన్లక్కడా అక్కడి సామాన్లిక్కడా సర్దుతూ. మనోహరానికి నిద్రపట్టటంలేదు, విసుక్కునిలేచికూర్చున్నాడు మంచంమీద. "ఈ హంగామాఅంతా యజమానిగారువస్తారని కామోసు...అబ్బ! ప్రాణాలుపోతున్నాయి వెధవ చప్పుడు." అనుకుని మళ్ళీ మంచంమీదపడుకుని దొర్లటం ప్రారంభించాడు ... నిద్ర ఎప్పుడుపట్టిందో అతనికే తెలియలేదు...

మర్నాడు సాయంత్రం మళ్ళీ పార్కులో తయారయ్యాడు మనోహరం. కొండశిఖరంఎక్కి చుట్టూ చూశాడు ... అబ్బ! తను ఎంతఎత్తుమీదున్నాడు! పట్టణంలో యిళ్ళన్నీ అక్కడక్కడ పరిచిన చిన్న చిన్న వస్తువుల్లా కనిపించాయతనికి. అయిదునిమిషాలు అక్కడనేనుంచుని క్రిందకిదిగడం ప్రారంభించాడు. చాలాసన్నమెట్లు. మెల్లిగా జాగ్రత్తగా దిగుతున్నాడు. కొన్ని గజాల దూరాన్ని ఒకఅమ్మాయి, చిన్న పిల్లాడూ...ఇద్దరూ మెట్లెక్కి పైకివస్తున్నారు. "ఆ అమ్మాయి ఎంత అందంగావుంది! సౌందర్యం అంటే యిదేకదూ" — ఏవో పిచ్చి పిచ్చి వూహలు బయల్దేరాయి మనోహరం హృదయంలో. అలాగే మెట్లుదిగుతున్నాడు ... వచ్చింది ఆ అమ్మాయి చాలాదగ్గిర కొచ్చింది .. మనోహరాన్ని చూసింది. రెప్పలు రెపరెప కొట్టుకున్నాయి...ఒళ్ళు గగుర్పొడిచింది...కాళ్ళు తడబడ్డాయి...వశంతప్పినట్లు కనిపించింది...ఈస్థితిలో పిల్లాడిని జాగ్రత్తగా నడిపించాలన్న సంగతి మరిచిపోయిందా అమ్మాయి...పాపం పిల్లాడికాలుజారింది. రెండుమెట్లు క్రిందకిదొర్లాడు ... గుక్కతిరక్కుండావుంది ఏడుపుతో—మనోహరం వెంటనే అతణ్ణి పట్టుకున్నాడు ... లేకపోతే ఆపిల్లాడు యింకా పదిమెట్లు దొర్లిపోవలసినవాడే ... నయం, వాడికి దెబ్బలేవీతగల్లేదు. కాస్సేపు గుక్కపట్టి అక్క వూరుకోపెడితే కొంచంవెక్కడం ప్రారంభించాడు. "ఎంతో కృతజ్ఞురాల్నండీ ... మా తమ్ముణ్ణి" అంటూ మళ్ళీ భాషమార్చి ఇంగ్లీషులో చెప్పడం మొదలెట్టిందా అమ్మాయి.

"మాభాష తెలుగేలెండి ... అయినా కృతజ్ఞత చూపించటానికి నేనుచేసిన ఘనకార్యం ఏంవుందీ?"

"అలా అనకండి ... మీరు లేకపోతే మాతమ్ముడిగతి ఏవయేదో"

"నేను లేకపోతే మీతమ్ముణ్ణి జాగ్రత్తగా నడిపించుందురేమో!"

ఆ మాటలు ఎందుకన్నాడో అతనికే తెలియదు.

ఆ అమ్మాయిముఖంలో కొంచం చిరునవ్వే దానికిసమాధానం.

ఒక క్షణం నిశ్శబ్దం ... మనోహరం ఈసారి ఆ అమ్మాయిలోకి చూశాడు ప్రశాంతంగా. ... ఏదో ఎలక్ట్రిక్ షాక్‌లాగ తగిలిందతనికి! ఆ అమ్మాయిముఖం పరిచితమైనదానల్లే కనిపిస్తోందే ... ఎవరు? అన్నది అతని హృదయం యింకా నిర్ధారణ చెయ్యలేకపోయింది. ఇదంతా మరోక్షణంలో జరిగింది.

"అయితే మీరు తెలుగువాళ్ళే నన్నమాట?" మెల్లిగా అడిగాడతను.

"మరేనండి... ... ..."

"బెంగుళూరేనా మీనివాస స్థలం?"

"కాదు, అప్పుడప్పుడు వస్తూంటాం..."

"నాప్రశ్నల్తో మిమ్మల్ని విసిగించటంలేదుకదా ... ఈ వూళ్ళో స్వచ్ఛమైన తెలుగుమాట్లాడేవాళ్ళు వచ్చినాదొరకరు ... అందుకని మనవేపువాళ్ళు కనిపిస్తే ఏదోచెప్పలేనిసంతోషం..." చాలాదూరం వెళ్ళిపోతూన్నట్టనిపించిందతనికి ... అక్కడితో ఆపించాడు.

"అవును ... ఎప్పుడేనా మాయింటికిరండి మానాన్నతో మాట్లాడొచ్చు ... ఆయన తెలుగుసంఘం ఒకటి యిక్కడ స్థాపించడం విషయంలో వచ్చినప్పుడల్లా కృషిచేస్తూంటారు."

"చాలా సంతోషంగా వుంది ... తప్పకుండావస్తా... మరివెళ్తా..."

పెద్దబోనులోంచి యివతలపడినట్టుంది మనోహరానికిప్పుడు. ఎవరు ఆ అమ్మాయి? ... ముఖం పరిచితమైనదానిలాగేవుంది ... ఎవరు చెప్మా ... మనస్సు అనేక చీలికలైపోయింది ... అన్ని చీలికలూ పరిగెట్టాయి తలోవేపుకీ ... తనకు తెలిసిన ప్రతిస్త్రీనీతెచ్చి అతనిముందర నిలిపాయి ... ఆ ... తెలిసింది! నిర్మలకదూ ఆ అమ్మాయి...ఈమాత్రం జ్ఞాపకం చేసుకుందుకింతసేపా? ఎంతమారింది నిర్మల! ... అవును అయిదేళ్ళమాట...మారదేవిటిమరి ...తనుమారిపోలేదూ...ఇంతట్లో గుండెల్లో ఏదోదడ...నిర్మల!...నిర్మలైతే అలామాట్లాడుతుందా...అంతప్రశాంతంగా—అలా అర్థసహితంగా నావైపుచూస్తూ! ... ఎన్నటికీకాదు... ముమ్మాటికీ ఆ అమ్మాయి నిర్మలకాదు ... నిర్మలైతే మరికూడా ఆ అబ్బాయి ఎవరు? తమ్ముడు... అవును ఎందుకు పుట్టివుండకూడదూ? అయినా నిర్మలకీ బెంగుళూరికీ ఏం సంబంధం? ఏమో ... అయిదేళ్ళ మాట! పరిస్థితులు మారవేవిటిమరి! ... తనెందుకొచ్చాడు బెంగుళూరు? ఏవిటో మళ్ళీ అంతా అయోమయంగావుంది...!! ..."నిర్మలనాతో అంత మృదువుగా మాట్లాడదు...ఆ అమ్మాయి నిర్మలకాదు... అని ఘట్టిగా నిశ్చయించుకున్నాడు ... అయినా ఏదోఅనుమానం పరుగులెత్తుతోంది అటూ యిటూ ... పోనీ వాళ్ళింటికి వెళ్తాంగా ... ఆ అమ్మాయితండ్రిని చూస్తే అంతా తెలిసిపోతుంది. ఎంతమారినా ఆయన్ని ఆనమాలుపట్టడం చాలాసులువుగా కనిపించింది మనోహరానికి. "రేపు వాళ్ళింటికెళ్దాం" అనుకున్నాడు. అడ్రసు? అని ప్రశ్నించింది మనస్సు! అరరే! — ఎంతమూర్ఖుడు తను — ఎడ్రసు తీసుకోవటం మరిచిపోయాడు! ఇంతా ఆలోచించిందంతా బూడిదలోపోసిన పన్నీరే? మళ్ళీ ఆ అమ్మాయి అతనికి కనిపిస్తుందన్న నమ్మకం ఏవిటి? కనిపించటం వట్టిమాట ... పోనీ గబగబా మళ్ళీవెళ్ళి ఆ అమ్మాయిని కలుసుకుని అడ్రసు అడిగితే...ఛా! అంతకన్నా నీచపుపని మరోటివుండదు ... ఈ ఆలోచనల్తో "రూం" చేరుకున్నాడానాడు. ఆ రాత్రి నిద్రపట్టలేదుపాపం. (సశేషము)

# ★ నిర్మల ★

గోటేటి శ్రీ జగన్మోహనరావుగారు

( గత సంచిక తరువాయి )

తెల్లారింది ...... తువాలు పైన వేసుకుని కుళాయిదగ్గరి కెళ్లాడు ............ ఆ అమ్మాయి ప్రత్యక్షం!....ఏవిటిది ? — ఏదో ఇంద్రజాలంలా కనిపించిందతనికి....అలా మాటలేకుండా నిలబడి పోయాడు! .... తలపైకెత్తి చలించి చటుక్కున అడిగిందా అమ్మాయి .... "ఏమిటిలావచ్చారు!" ...

"ముందు రూంలో వుంటున్నాను .... "

"మా రూంలో వుంటున్నది మీరా ...." అని ఏదో బాధలోంచి నివృత్తి అయిన దానికి మల్లే దీర్ఘంగా శ్వాసవదిలింది ఆ అమ్మాయి. ఒక్క చిరునవ్వు నవ్వి "వస్తాను" అని మెఱుపులా తలుక్కుని మెఱిసి మాయమైంది. ... మనోహరం యిప్పుడొక యంత్రంలాగ పనిచేస్తున్నాడు ... ఏంచేస్తున్నాడో ఎలాచేస్తున్నాడో తెలియటం లేదతనికి ... గదిచేరాడు పదినిమిషాల్లో ....

అవాళ సాయంత్రం ఆ అమ్మాయి తండ్రిని చూశాడు ... నిర్మల తండ్రే అతను ... ఆ అమ్మాయి నిర్మల! .... మళ్లీ ఆశ్చర్యం కలిగిందతనికి ... తన్ని చూసి గుర్తుపట్టలేక పోయిందేమో ! ........ అప్రను తను మరీ యిదిగా మారిపోయాడు ... నుదుటిమీద నాటుండబట్టి అసలు ఆనవాలు పట్టడానికి వీలుండదు ... అందుకే నిర్మల స్వభావంలో అంత తేడా! .... నిర్మల తండ్రిని కలుసుకుని చాలాసేపు మాట్లాడాడు. — చాలాసార్లు మాట్లాడాడు కూడాను. నిర్మల తండ్రి ఎందుకో అతనికేసి అంత ఆప్యాయంగాచూసి విసుగూ విరామం లేకుండా మాట్లాడుతాడు! ... ఒక్క సారి తన జీవితపథంమీదకి పోయింది దృష్టి .... కాని ఏది నిర్ధారణ చెయ్యడానికీ వీల్లేదింకా. తను ఎవరైందీ యింకా నిర్మలకి తెలియదు ... తెలిస్తే? ... ఏమో ఏమౌతుందో నిశ్చయించలేక పోయాడు. తనవిషయం నిర్మల తండ్రికి టూకీగా చెప్పవలిసొచ్చినా ఫరవాలేదు. నిర్మలావాళ్ళు కూడా నాలుగేళ్ళుమట్టీ రాజమహేంద్రవరంలో లేరట ... మరో గొప్పఉద్యోగం మీద బొంబాయి వెళ్లవలిసొచ్చిందిట ఆయన ... అందుకే తను శెలవులకి యింటికెళ్లినప్పుడు వీళ్లెవరూ కనిపించలేదు ... పాపం నిర్మలతల్లి ఒకపిల్లాణ్ణి కని చనిపోయిందట!

నిర్మలకీ, మనోహరానికీ స్నేహం ఎక్కువవుతూ వచ్చింది. మనోహరం అప్పుడప్పుడు వాళ్ల హాల్లోనే చాలాసేపు కూర్చుండి పోయేవాడు.

మూడు నెలలు గడిచినై. నిర్మలకి ఒకవిషయం తోచింది .... మనోహరం తల్లి దండ్రు లెవరో ? — తనకి తెలియలేదు. తండ్రి చెప్పలేదు .... మనోహరాన్ని తను అడగ లేదు. అవాళ నిర్ధారణగా తెలుసుకోవాలని బుద్ధిపుట్టింది.

మనోహరం అప్పుడే "రూం"కి వచ్చాడు. ...... నిర్మలనెమ్మదిగా వెళ్ళింది రూంలోకి ...

"సరిగ్గా నా రాకకి ఎదురు చూస్తూన్నట్టు .... ప్రవేశించార్కే — ఏమిటి విశేషం?"

"మనోహరంగారు గదితక్షణం ఖాళీచెయ్యాలని మా నాన్నగారి ఆజ్ఞ" ఈ మాటలు కచ్చితంగా అంది నిర్మల.

"నిజమే ? — కారణం !" ఆతురతతో అడిగాడతను. వెంటనే ఫక్కుమని నవ్వింది నిర్మల. అప్రయత్నంగా అతనూ నవ్వాడు. ఆ తన్మయత్వంలో తనజేబులో వున్న కాగితాలు బల్లమీద పారేశాడు మనోహరం.

"ఏం కాయితాలవి ..." అంటూ వెంటనే వాటిని తీసింది నిర్మల ............ మనోహరానికి ఒళ్ళు జలదరించినట్టయింది ....

"అబ్బ — వొద్దు నిర్మలా ... అవిల్లా యిచ్చెయ్యి !" దీనంగా అడిగాడు.

"ఓహో కథ కాబోలు — నేను చదవకూడనిదా ?"

"చదవకూడనిదని కాదు .... చదవకుండా వుంటే మంచిదని !"

అలా అయితే తప్పకుండా చదవాలి !"

"..................."

ఏవనాలో తోచటంలేదు మనోహరాన్ని. ఏంచెయ్యాలో అసలు అర్థం కావటం లేదు ... నిర్మలకి తను ఘోరవిరోధి — ఈ సంగతి మూడు నెలలుగా నిర్మల గ్రహించ లేక పోయింది ... ఇప్పుడు తనంతటతనే తెలుపుకుంటున్నాడు ... అబ్బ ... మనస్సు అమితంగా కలిగిపోతోంది ... స్తబ్ధులా నుంచుండి పోయాడు.

కథ చదవటం ప్రారంభించింది నిర్మల ... నిర్మలముఖాన్ని తదేక దృష్టితో పరికిస్తున్నాడు మనోహరం. ఆ ముఖంలో మార్పుల్నిబట్టి కథాభాగం అతనికి స్పష్టంగా తెలుస్తోంది ......... చదవను, చదవను చేతులు వణుకుతున్నాయి నిర్మలకి .... పర్యవసానం వూహించుకో లేకుండా వున్నాడు మనోహరం.

ఆఖరిపేజీ చదువుతోంది తలబాగా కిందకి వంచేసి .... కొంతసేపటికి ధైర్యం తెచ్చు కుని తలపైకెత్తి మనోహరం కళ్ళల్లోకి దీర్ఘంగా చూసింది నిర్మల .... చేతులో కాయి

తాలు తమంతటవి క్రిందకిజారిపోయాయి ... "మనోహరం ..." అనగలిగింది మెల్లిగా. తన ప్రేమనంతా తెలియబరుస్తూ ప్రశాంతంగా చూశాడు నిర్మల కళ్ళల్లోకి ...... క్షణం నిశ్శబ్దం. "పూర్వపు విషయం మరిచిపో మనోహరం! ... ఇప్పుడు నా హృదయం నీది ... నేను ... !" అని పెదివి కరుచుకుని సిగ్గువన మాయమైంది నిర్మల ......

నిర్మల మాట్లాడేవరకూ పర్యవసానం ఊహించుకోలేక పోయాడతను ... నిర్మల తన కథ చదివిన తరువాతకూడా ప్రేమభావం వెలిబుచ్చుతుందని అతను ఎన్నడూ నమ్మలేదు .... నిర్మల మాటలు అతణ్ణి చలింపజేశాయి .... సంతోషంలో ఒక్క చిటిక వేసి నవ్వుతూ మంచంమీద కూలబడ్డాడు .... నిర్మల తనని అమితంగా ప్రేమిస్తోంది.... ఎటువంటి దారుణ సందర్భాలైనా ఆ ప్రేమని విచ్ఛిన్నంచెయ్యలేవు – అని గ్రహించాడు....

నిర్మలకీ సంఘటన ఆశ్చర్యం అనిపించింది ...... "ఆ మనోహరమే – యీమనోహరం" .... ఇది నిజమే? అని నిర్మలమనస్సు లక్షసార్లు ప్రశ్నించింది ... "కాదు యితను పేరు ..." అని నిర్మల సమాధానం చెప్పుకోబోయింది .... కాని ఆ కథ అచ్చంగా కళ్ళకి కట్టినట్టుంది ...... వెంటనే "అప్పటి మనోహరానికీ యిప్పటి మనోహరానికీ ఎంత తేడావుందీ ... అయిదేళ్ళల్లో ఎంత మార్పొచ్చిందీ ...." అనుకుంది ...... అయినా ఏవిటో మనస్సు సమాధానపడలేదు .... ఆఖరికి "అప్పుడు మనోహరాన్ని అర్థంచేసుకోడానికి ప్రయత్నించలేదు ... ఇప్పుడు అర్థంచేసుకోవలసిన అవసరం తనంతటదే వచ్చింది ...." అనుకుంది ....... అప్పటికీ మనస్సు స్థిమితపడినట్టు కనబడలేదు. "మనోహరాన్ని చిన్నప్పుడే ద్వేషించి నిరసించావు కదూ — అతనే యీ మనోహరమే కూడాను — యిప్పుడు నీలో ఎందుకింత మార్పు ...." అని ఏదో ఉద్బోధించి నట్టయింది నిర్మలకి .... హృదయం దడ దడ కొట్టుకోవటం ప్రారంభించింది ...."కాదు, మనోహరమే నా సర్వస్వం...అతన్ని గౌరవిస్తాను అతన్ని ప్రేమిస్తున్నాను .." అనిగట్టిగా అరుస్తూ లేచింది నిర్మల...ఒక్క సారిగ పూర్వపుసంగతంతా మరిచిపోయి నట్టయింది..... ఇదంతా మరీ ఆశ్చర్యం. అనిపించింది నిర్మలకి ... అప్రయత్నంగా నవ్వింది.

